కథ

కె.ఎన్.బాలాజీ

# రోడ్డు దాటినవాడు

'ఇడియట్ టీ సెంటర్' చాలా రద్దీగా ఉంది. నగరం కూడా యథావిధిగా రద్దీగానే ఉంది. రోడ్లు, హోటళ్లు, దుకాణాలు మనుషులతో నిండిపోయాయి.

మనుషుల మధ్య దారి చేసుకుని హోటల్లోకి వెళ్లటానికి పది నిముషాలు పైనే పట్టింది. కూర్చోవటానికి ఎక్కడా ఖాళీ కుర్చీలు లేకపోవటంతో విసుగూ, కోపం ఎక్కువైపోయాయి. శ్రీనివాస్ నా వైపు విసుగ్గా చూశాడు.

రాత్రి తొమ్మిది దాటుంటుందేమో! జనంతో ఎప్పుడూ రద్దీగా ఉండే హోటళ్లను చూసి మొదట్లో ఆశ్చర్యపోయేవాడ్ని. ఇప్పుడంతా అలవాటయిపోయింది.

ఇంతమంది జనం ముఖ్యమైన పనున్నవారిలాగా, తప్పనిసరైన కర్తవ్యంలాగా హోటళ్లకి రావటం మొదట్లో నాకు వింతగా అనిపించేది. వీళ్లకంతా ఇండ్లు లేవా? ఇంట్లో పెండ్లాలు లేరా? వంట పదార్థాలు లేవా అని సందేహపడేవాడ్ని.

కాలేజీ రోజులు దాటి, ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగస్తుడైనప్పుడు మనసులో బలంగా అనుకున్నాను. హోటళ్లకి ఎప్పుడూ డబ్బు తగలెయ్యకూడదని. అట్లా అనుకున్న రోజే పార్టీ పేరుతో ఆఫీసువాళ్లని హోటల్‌కి తీసుకువెళ్లాల్సి వచ్చింది. రకరకాల కారణాలతో, పేర్లతో హోటళ్లకి రావటం తప్పలేదు.

పెండ్లయినప్పుడు మళ్లీ గట్టిగా అనుకున్నాను. హోటళ్లకి డబ్బు తగలెయ్యకూడదని.

పెండ్లయిన కొత్తలో ఆమె కోసం, ఆ తర్వాత వెరైటీ కోసం, ఆ తర్వాత ఆకలి తట్టుకోలేక, ఇంట్లో సమయానికి తింటానికేమీ దొరక్క, ఇంట్లో వండింది రుచించక, పిల్లల కోసం సరదాగా ఇట్లా చెప్పుకుంటూపోతే సవాలక్ష కారణాలతో హోటల్‌కు రావటం తప్పలేదు.

''ఏమండీ ఎప్పుడూ నేను వండటం, మీరు తినటమేనా? మీకు విసుగ్గా అనిపించటం లేదా'' అని మా ఆవిడ ఆశ్చర్యాన్ని ప్రకటించేది.

''పోనీ నేను వండనా'' అని మాటవరసకి అనేవాడ్ని. ఎందుకో ఆమె విపరీతంగా నవ్వేసేది.

అసలు హోటలుకు రావటం, రాకపోవటం అనేది నా చేతుల్లో ఉందా, లేక మా ఆవిడ చేతుల్లో ఉందా అని కూడా సందేహం కలిగేది.

''ఇంకో హోటల్‌కి పోదామా'' అసహనంగా అన్నాడు శ్రీనివాస్.

నిర్లిప్తంగా అతడి వైపుచూశాను.

ఎక్కడైనా రష్ ఇలాగే ఉంటుందని వాడికీ తెలుసు. అయినా అసహనాన్ని, అసంతృప్తిని ప్రకటించటానికి ఎప్పుడూ అతిగా ఉత్సాహం చూపేవాళ్లల్లో వీడొకడు.

చుట్టూ చూశాను.

టేబుళ్ల దగ్గర నిలుచున్న జనం తమ వంతు కోసం చిరాగ్గా ఎదురుచూస్తున్నారు. నింపాదిగా కూర్చుని తింటూ తాగుతూ ఉన్న జనం, కబుర్లతో, ఆలోచనలతో, గుంపుగా ఒంటరిగా ఉన్న జనం. నిలుచున్న వాళ్లవైపు అస్సలు చూడ్డం లేదు. నిలుచున్న వాళ్లు కూర్చున్న వాళ్లని పరమద్వేషంగా చూస్తున్నారు.

నా ముందరున్నతను ఎంగిలి చెయ్యిని పైకెత్తుకుని బాక్సింగ్ వీరుడి మాదిరి ప్రదర్శిస్తూ లేచి నిలబడి సీటు ఖాళీ చేయగానే మెరుపు వేగంతో ముందుకు ఉరికాను. ఇద్దరు ప్రత్యర్థుల నుండి పోరాడి మరీ సీటు దక్కించుకున్నాను.

ఎంత బలవంతంగా ఆపుకున్నప్పటికీ నాకు నవ్వాగలేదు. ఇట్లాంటి విజయాలు ఎంత గొప్పవంటే ఒళ్లంతా పులకరించిపోయింది.

కొత్త మొహంతో, నిలుచున్న వాళ్లని యథాలాపంగా చూశాను.

నిలుచున్నవాళ్ల చూపుల్ని చూడగానే భయంతో వణికిపో



యాను.

మరి కాసేపట్లో నా పక్క సీటు సంపాదించి శ్రీనివాస్‌కు బహూకరించాను.

ఎందుకో శ్రీనివాస్ మౌనంగా ఉండిపోయాడు. వాడేదో గొప్ప విషాదంలో ఉన్నట్లు బాధపడిపోతూ ఉంటాడు. వివరాల్లోకి వెడితే కారణాలు మాత్రం నవ్వు కలిగిస్తుంటాయి. వాడి విషాదానికి కారణం వాడి బాధలు కావు. ఆ కష్టాలు, కన్నీళ్లు వాడికి ఏమాత్రం సంబంధం లేనివాళ్లవి. ఈరోజు తమిళనాడులోని కుంభకోణంలో 90 మందికి పైగా పిల్లలు స్కూల్లోనే అగ్నిప్రమాదానికి గురై మరణించారు. టీవీలో ఆ దృశ్యాల్ని చూసి బహుశా చలించిపోయి ఉంటాడు. లేదా చిత్తూరు జిల్లాలో బోర్లు ఫెయిలయిన రైతు అప్పుల వాళ్ల బాధల్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. వాళ్ల భార్య, కూతురు, కొడుకు కూడా సామూహికంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ కారణం వల్ల కూడా శీనుగాడు అంత బాధపడిపోతూ ఉన్నాడేమో.

ఎవడైనా వాడి కోసం, వాడి కుటుంబం కోసం ఏడుస్తాడు. వీడేమో ముక్కూ మొహం తెలీని వాళ్ల కోసం, ముఖపరిచయం లేని వాళ్లకోసం ఏడుస్తాడు.

బాబ్రీ మసీదు కూలిపోయిన రోజు మా ఆఫీసులో బిగ్గరగా రోదించినప్పుడు వాడ్ని చూసి అంతా నవ్వుకున్నారు. వాడి మతాన్ని, పుట్టుకని కూడా అనుమానించారు.

వాడ్ని పేపరు చదవకుండా, టీవీ చూడకుండా కాపాడుకోవాలని వాళ్లావిడ నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. అయినా శీనుగాడికి ప్రపంచంలో రోజూ జరిగే విషాదాలు తెలిసిపోతూనే ఉంటాయి.

సద్దాం హుస్సేన్ బందీగా పట్టుపడినప్పుడు ఆ రోజంతా భోంచెయ్యని వాడు ఈ శ్రీనివాస్.


తలతిప్పి హోటలంతా చూశాను. తెలిసిన మొహాలేవీ కనపడకపోవడంతో కొంత సంతోషం, కొంత విచారం ఏకకాలంలో కలిగాయి. నన్ను గుర్తించే వాళ్లెవరూ ప్రస్తుతానికి ఈ హోటల్లో లేకపోవటం వల్ల నా ప్రవర్తన ఎలా ఉన్నా అడిగేవాడు లేడనే కారణంగా సంతోషం కలిగింది. అయితే ఇంత పెద్ద నగరంలో నన్ను ఎరిగినవాడు ఈ హోటల్లో లేకపోవడం, నా పరిమిత గుర్తింపునకు కారణం కావటం వల్ల విచారం కలిగింది.

మేం వచ్చి ఇంత సేపయినా మమ్మల్ని పట్టించుకోని హోటల్ సర్వర్‌పైనా, మేనేజ్‌మెంట్‌పైనా విపరీతమైన కోపం వచ్చేసింది. ఆకలి, ఆవేశం ఒకదాన్నొకటి ఉత్సాహపరచుకునే ప్రయత్నాలు చేశాయి.

ఇంత ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా, అగౌరవంగా వ్యవహరించే హోటళ్ల వారిపై చర్య తీసకోవటానికి వీలుగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన తక్షణ అవసరం ఉందనిపించింది. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ప్రతిపక్ష నాయకుడికి రేపే ఉత్తరాలు రాయాలని నిర్ణయించేసుకున్నాను.

ఇంటికి, హోటల్‌కి తేడా ఏమిటో అర్థం కాని అయోమయంలో పడిపోయాను.

ఇంట్లో నన్నూ, నా ఆకలిని, నా అవసరాల్ని, నా రుచుల్ని, అభిరుచుల్ని, నా మూడ్‌ని మా ఆవిడ అసలు పట్టించుకోవటం లేదనే నేను



హోటల్‌కి రావటం.

అయినా ఇంట్లో నేను పొందలేని గౌరవాన్ని, ఆశించే మర్యాదని ఇంతవరకూ ఏ హోటల్లోనూ పొందలేకపోయాను. ఎన్ని హోటళ్లు మార్చానో ఇప్పటికి. ఎంతయినా భార్యని మార్చుకోలేని వాడ్ని.

ఇంట్లో చేతకానివాళ్లే హోటళ్లకు వస్తారని హోటల్ వాళ్లకు ముందే తెలుసేమో! అందుకే కస్టమర్స్‌ని అస్సలు పట్టించుకోరు.

మండే కడుపుతో ఏ హోటల్‌కి వెళ్లినా నా ఆకలిని గుర్తించి చప్పున ఇంత ముద్ద పెట్టిన వాడు లేడు.

## కొత్త బాధ్యత

**తారలు దర్శకులుగా, నిర్మాతలుగా మారడం మామూలే. అయితే సినిమాల్లోకి వచ్చిన అతి కొద్దిటైంలోనే 'అమ్మాయి బాగుంది' అన్పించుకున్న మీరాజాస్మిన్ ఇప్పుడు నిర్మాతగా మారుతోందన్న వార్తలు విన్పిస్తున్నాయి. ఓ మళయాళ చిత్రాన్ని తమిళంలోకి రిమేక్ చేస్తుండగా, ఆ చిత్రానికి నిర్మాతగా తెరవెనుక పాత్ర పోషించడానికి సై అంటోంది మీరా. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు నిర్మాతగా కొత్త బాధ్యతలు ఎలా ఉంటాయో చూస్తోంది మీరా. ఈ బాధ్యతల్ని ఆమె ఎలా నిర్వర్తిస్తుందో చూడాల్సిందే!**

హోటల్ వాడి చూపులెలా ఉంటాయో నాకు బాగా తెలుసు. విధి లేక నేను హోటల్‌కి వచ్చినట్లు ఉంటుంది వాడి వాలకం.

వెయిటర్ రావటంతో ఆలోచనలు ఆగిపోయాయి. వాడివైపు సాధ్యమైనంత కోపంగా, హీనంగా, అధికారపూర్వకంగా చూస్తూ ''ఇంత సేపా...ఆర్డర్ తీసుకోవటానికి'' అన్నాను గట్టిగా.

హోటళ్లోని రద్దీ కారణంగా, రణగొణ ధ్వనుల కారణంగా నా మాటలు నాకే సరిగ్గా వినిపించలేదు. వాడైతే అసలు నా వైపు చూడనే లేదు.

వాడికి తల లేదు. కొత్తగా హోటల్లో చేరిన పల్లెటూరి రైతులా ఉన్నాడు. నీళ్ల గ్లాసు టేబుల్‌పైన ఉంచి ఆ కొన నుంచి నా వైపుకి విసురుగా తోశాడు. ఎక్కడ ఆ నీళ్లు వొలికిపోతాయేమోనని కంగారుగా కుర్చీలో వెనక్కి వాలాను. శీనుగాడు నింపాదిగా కూర్చునే ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే నేను ఊహించినట్లు నీళ్లు వొలికిపోలేదు. గ్లాసు సరిగ్గా నా ముందు కొచ్చి ఠీవిగా నిలబడింది. అదే మాదిరి మరో

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

గ్లాసు శీను ముందుకొచ్చింది.

వాడి నైపుణ్యం ముందు మన క్రికెట్ వీరులు కూడా దండగే అనిపించింది.

టిఫిన్ ఆర్డర్ తీసుకుని వెయిటర్ జనంలో కల సిపోయాడు.

''ఎంత పనితనం చూడు. వ్యవసాయంలో కూడా ఎంతో నైపుణ్యం ఉండే ఉంటుంది. అందుకే తల పోగొట్టుకుని ఉంటాడు'' యథాలా పంగా అన్నాడు శీను.

''నగరంలో తలలేనోళ్లు ఈమధ్య ఎక్కువైపో తున్నారు శీనూ. బస్సుల్లో, లారీల్లో, రైళ్లల్లో తల లేనోళ్లు గుంపులు గుంపులుగా వచ్చేస్తున్నారు'' అన్నాను సిగరెట్ వెలిగిస్తూ.

''కరెంటు లేదు. నీళ్లు లేవు. నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు, బోర్లు ఫెయిల్యూర్. రైతులు అప్పుల్లో మునిగిపోయారు. కొత్త అప్పులు దొర కటం లేదు. చెయ్యటానికి పనుల్లేవు. తింటానికి తిండి లేదు. పనులు వెతుక్కుంటూ పొట్ట చేత్తో పట్టుకుని, రైతులు వచ్చేస్తున్నారు. ఇక్కడా వీళ్లు బతికిపోతారని గ్యారంటీ లేదు. వీళ్లిక్కడ ఇమడ లేరు. వెళ్లిపోతారు చూడు'' సిగరెట్ పొగల మధ్య శీనుగాడు కనిపించటం లేదు. వాడి గొంతు మాత్రం వినిపిస్తోంది.

''మనం మాత్రం ఉంటున్నామా. మనమూ వెళ్లిపోతున్నాం కదా!'' అన్నాను కొంచెం గొంతు తగ్గించి.

''ఇంకో ఐదేళ్ల సర్వీసు, ప్రమోషన్ అన్నీ వదు లుకుని బలవంతంగా రిటైర్ కావల్సి వచ్చింది. ఖర్మానికి నాకు చాలా ఆలస్యంగా పుట్టారు పిల్లలు. వాళ్లింకా చిన్నవాళ్లే. రేపట్నుంచి ఎక్కడికి పోవాల్నో, ఏంచేసి బతకాల్నో తెలీకుండా ఉంది. మా పిల్లలు ఎప్పుడు సెటిల్ అవుతారో ఏంటో!''

ఉదయం జరిగిన వీడ్కోలు సమావేశంలో మా మేనేజర్ శ్రీధర్‌రెడ్డి భయం భయంగా అన్న మాటలెందుకో హఠాత్తుగా గుర్తొచ్చాయి.

వరుస నష్టాలతో సిటీలోని మా కంపెనీ బ్రాంచ్ మూసేశారు. చాలామందిని ఉద్యోగాల్లోంచి తొలగించేశారు. వాలంటరీ రిటైర్మెంట్ అనో, కంప ల్సరీ రిటైర్మెంట్ అనో కాగితాలు ఇచ్చేశారు.

నాకూ, శీనుగాడికి మహారాష్ట్ర లోని మారుమూల ప్రాంతంలో ఉన్న బ్రాంచ్‌కి ప్రమోషన్ పైన బదిలీ ఉత్త ర్వులు ఇచ్చారు.

యూనియన్ లీడర్లయిన కార ణంగా రేపు కోర్టు కేసులు, గొడవలు లేకుండా చేసుకోవటానికి, నగరంలో మేం కనపడకుండా ఉండటానికి వీలుగా కంపెనీ వారు చేసుకున్న తెలి వైన ఏర్పాటు అది.

''అరవై కోట్లు విలువచేసే కంపెనీ ఆస్తుల్ని పాత ప్రభుత్వం ఆరు కోట్లకు అమ్ముకుంది. అడి గేవాడు లేడు'' కోపంగా అన్నాడు శ్రీను. కొంచెం కూడా వాడికీ విషయం విచారం కలిగించకపో వటం ఆశ్చర్యమే. ఎంతోమంది కన్నా మనం మేలు కదా అనుకునే రకం వాడు.

''మీవాళ్లు ఇక్కడే ఉంటారన్నావు కదా. మళ్లీ ఏమైనా అభిప్రాయం మార్చుకున్నారా?'' శీను ప్రశ్నకు సమాధానంగా నవ్వాను.

''వాళ్లీ మహానగరాన్ని విడిచి రామని తేల్చి చెప్పే శారు. వాళ్లను చూడాలనిపించినప్పుడు నన్నే ఇక్క డికి వచ్చిపొమ్మన్నారు. రేపు సాయంత్రమే మన ప్రయాణం. మళ్లీ ఈ నగరాన్ని ఎప్పటికి చూస్తానో ఏమిటో'' అన్నాను మెల్లగా.

టిఫిన్ వచ్చింది. మాటలాపి ఇద్దరం తిన సాగాం. టీ పొగలు కక్కుతూ వచ్చింది. అద్భుత మైన టీ! నాలుక కాలిపోయి, పెదవులు మండిపో యాయి. మహావేడిగా ఉన్న టీ తాగటం అంటే నాకు చాలా ఇష్టం.

రోజువారీ జీవితంలో ఎన్నో అద్భుతాలు చేసే మా ఆవిడ ఇట్లాంటి టీ మాత్రం ఇంతవరకూ చేయకపోవటం ఆమె నేరం. అయినా ఇంత మంచి, గొప్ప టీ చేసే తీరిక మా ఆవిడకు ఎప్పుడూ ఉండదు.

పిల్లలు పెరిగే కొద్దీ ఖర్చులు పెరిగిపోయాయి. మార్కెట్‌లోకి ప్రవాహంలా దూసుకువచ్చే వస్తు సముదాయానికి ఇంట్లో వీలైనంత వరకూ చోటు కల్పించే ప్రయత్నంలో, మా ఇల్లొక వస్తు ప్రదర్శన శాలగా మారిపోయింది. చీరల వ్యాపారం, చీటీల వ్యాపారంతో మా ఆవిడ సంపాదించింది కానీ కొంతమంది పెద్దమనుషులు వాయిదాలు కట్టకపో వటంతో, విషయం పోలీసు స్టేషన్ వరకూ వెళ్లింది. పెట్టుబడి కోసం అప్పిచ్చినవాళ్లు ఒక్కసా రిగా మీద పడ్డారు.

ఆ గొడవలోంచి బయట పడ్డానికి సంవత్సరం పట్టింది. ఆ గొడవ తర్వాత మా ఆవిడకు నాకు చాలా గొడవలు జరిగాయి. తనను ప్రశాంతంగా ఉండమన్నాను. తను వినలేదు. ఉన్నదాంట్లో తృప్తిగా ఉండాలన్నాను.

''ఏముండాదీడ. ముడ్డిచుట్టూ అప్పులే కదా ఉండేది. బతికేదానికి ఏదో ఒకదారి సూసుకోక పోతే మనం వీధిన పడేది ఖాయం'' విసురుగా మాట్లాడింది మా ఆవిడ.

మా ఆవిడకు ఈ శీనుగాడొక పెద్ద సపోర్టు. ''ఆమెను ఆలోచించనివ్వు. సంపాదించనీ. పంజ రంలో బంధించకు'' అనేవాడు.

''నీకు సంపాదించటం చేతకాదు. ఈ వ్యాపా రాలన్నీ మానేయ్'' అని గట్టిగా చెప్పేశాను మా ఆవిడతో.

''నీకు మాత్రం సంపాదించేది మహా చేతయి నట్లు మాట్లాడకు. నీ సంపాదనతోనే ఇల్లు గడిచే రోజులు పోయాయి'' పొగరుగా అంది మా ఆవిడ.

బెల్ట్ తీసుకుని మా ఆవిడ్ని చావబాదేశాను. అయినా ఆవిడ దెబ్బలు తింది కానీ నా మాట విన లేదు. నాకు తెలీకుండానే బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసి, ఇంట్లోనే ముందర గదిలో 'బ్యూటీ పార్లర్' పెట్టేసింది.

ఆ రోజు రాత్రి మా ఇద్దరి గొడవలకి శీను ప్రత్యక్ష సాక్షి.

''కష్టపడి పనిచేయాలనుకునే జాతి అంతరిం చిపోతోంది. కష్టం లేకుండానే సంపాదించాలనుకునే వాళ్లతో ప్రపంచం నిండిపోతోంది. ఆమె కష్టపడతా నంటే నువ్వెందుకు వద్దంటావ్. ఇప్పటికే చాలా అప్పులున్నాయి. అప్పులు తీరేంతవరకైనా ఆమె సంపాదించనీ'' అన్నాడు శీను.


అప్పు తీర్చటం అనే మాట మంత్రంలాగా పని చేసి నా నోరు కట్టేసింది.

అప్పుతీర్చటం అనే సంగతి ఏమిటో కానీ ఏరో జుకా రోజు కొత్త అప్పు చేయటం అలవాటయిపో యింది.

అప్పు చేయటానికి అనేక కార ణాలు, అవకాశాలూ కలిసొచ్చాయి.

పిల్లల చదువులు, ఖర్చులు, నిత్యావ సరాలు, టీవీ, టేప్ రికార్డర్, వి.సి.ఆర్, లేటెస్ట్ సి.డి.ప్లేయర్, అనేక రకాల వస్తు వులు, స్కూటర్ కొనటం, దానికి పెట్రోలు కోసం... ఇట్లా సవాలక్ష కార ణాలు అప్పు చేయటానికి. ఏదో ఒకటి కొనకపోతే మా ఆవిడకు నిద్ర పట్టదు. షాపింగ్ అంటే మా ఆవిడకు గొప్ప ఇష్టం.

దానికి తోడు బ్యాంకులు ఉదారంగా లోన్లు ఇవ్వటం ప్రారంభించాక మా పని మరీ సులువయిపోయింది. అసలు



అప్పుకోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పని తప్పిపోయింది. బ్యాంకులే మా ఆఫీసుల దగ్గరకు, ఇండ్ల దగ్గరకు వచ్చి మరీ స్పాట్ లోన్స్ ఇచ్చేస్తుండడంతో మేం చేసే అప్పులకు అంతంటూ లేకుండా పోయింది.

వడ్డీ కడితే చాలని, అసలు తీరిగ్గా కట్టొచ్చని బ్యాంకు వాళ్లు ఊరిస్తుంటే మా అప్పుల జాబితా పెరిగిపోసాగింది.

అప్పంటేనే ఇప్పుడు విసుగొచ్చేసి వాంతి అయిపోతోంది. బ్యాంక్ వారు ఎక్కడ కనిపిస్తారో, ఎక్కడ వాళ్లు సంతకాలు తీసుకుని లోన్లు ఇచ్చేస్తారో అనే భయం నన్ను నీడలా వెంటాడుతోంది. బ్యాంకు వాళ్లకు కనపడకుండా తిరగటానికే సాధ్యమైనంత వరకూ ప్రయత్నిస్తున్నాను.

నాలాగా బ్యాంకుల వాళ్ల చేతిలో దెబ్బతిన్న వాళ్లల్లో శీను కూడా ఉన్నాడు.

నాకైతే నగరానికి దూరంగా మారుమూల ప్రాంతానికి వెళ్లిపోతుంటే ఉద్వేగంగా ఉంది. ఉత్సాహంగా, భయంగా ఉంది. శీనుకు ఇవేవీ పట్టినట్లు లేదు. ఏమిటో నిశ్శబ్దంగా ఉన్నాడు. మరి కాస్సేపు హోటల్లోనే ఉందామనిపించింది. కానీ టేబుల్ దగ్గర నిలుచున్న వాళ్లల్లో అసహనం బాగా పెరిగిపోయి వాళ్ల మొహాల్లో తీవ్రమైన మార్పు కనిపించాక, తప్పనిసరై బిల్లు చెల్లించి హోటల్ ముందుకొచ్చి నిలబడ్డాం.

రోడ్డుపైన వాహనాలు నిర్విరామంగా, అమిత వేగంతో వెడుతున్నాయి.

కళ్లు మిరుమిట్లు గొలిపేలా నగరం వెలిగిపోతోంది. ఎందుకో నగరం కొత్తగా, వింతగా అనిపించసాగింది. ఇన్నేండ్లు నగరంలోనే ఉన్నప్పటికీ ఎప్పుడూ నగరాన్ని పరిశీలించే అవకాశం, సమయం లభించలేదు. అవసరం అంతకన్నా లేకపోయింది.

రోడ్డు విశాలంగా ఉంది. ఆది, అంతం తెలియటం లేదు. సిగరెట్స్‌తో, సెల్‌ఫోన్స్‌తో బిజీగా ఉంటూ ఒంటి చేత్తో వాహనాలు నడిపే వాళ్లను ఆపి నాలుగు తన్నాలనిపించింది.

## ఆణిముత్యం


**మంచి చిత్రాలతో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్న రాణీముఖర్జీ ఇప్పుడు కూడా అదే పంథాని అనుసరిస్తున్నట్టుంది. 'ది రైజింగ్'చిత్రంలో నటిస్తున్న రాణీ ఆ చిత్రంలో తన పాత్ర మంచి పేరు తెస్తుందని, తన కెరీర్ ఇదో ఆణిముత్యం కాగలదంటోంది. తనకి కొత్త రకం ఇమేజ్‌ని తెచ్చిపెట్టే ఈ చిత్రం కోసం రాణీ అహర్నిశలు శ్రమిస్తోంది. అన్నట్టు ఈ చిత్రం జూన్ 2005లో విడుదలకి సిద్ధం కాబోతోంది.**

నా దృష్టంతా రోడ్డుపైనే ఉంది. ఎవరైనా రోడ్డు దాటుతారేమోనని ఆసక్తిగా ఎదురుచూస్తూ నిలబడ్డాను.

''అప్పు చేయటం వ్యసనమైపోయింది. బ్యాంకులకు మనుషులు రాన్రానూ బానిసలైపోతున్నారు. అవసరం ఉన్నా లేకపోయినా కొనటం అనేది దారుణమైన అలవాటయిపోయింది. వ్యాపార ప్రపంచంలో మోసపోతూనే ఉన్నాం. నిలువు దోపిడీకి గురవుతున్నా ఎవరూ గుర్తించలేకపోతున్నాం. చూడూ.. షాపులన్నీ కిటకిటలాడుతున్నాయి. క్షణాల్లో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది రూపాయలు వ్యాపారం పేరుతో చేతులు మారుతోంది. కొనటం అనేది అవసరం స్థాయి నుంచి, అలవాటు స్థాయికి పడిపోయింది. ఇదొక గొప్ప విషాదం'' అన్నాడు శీను. కాస్సేపు మౌనంగా ఉండి మళ్లీ కొనసాగించాడు.

''రైతు పరపతి కోల్పోయాడు. తల తాకట్టు పెట్టినా అప్పు దొరికేదిలే. రైతులు తలలు లేని వాళ్లయి నగరంలో కూలి పనులు చేసుకుంటున్నారు. వాళ్లకు అప్పులు దొరక్క తిరుగుతా ఉన్నారు. మనం బ్యాంకుల వాళ్ల ఊబి.. అప్పుల ఊబిలో నిలువునా కూరుకుపోతున్నాం. చివరికి ఏమవుతామో తెలుసుకుంటేనే భయమవుతోంది.''

వెనక్కి తిరిగి హోటల్‌వైపు ఒకసారి తృప్తిగా చూసుకున్నాను.



హోటల్లో ఏ వెయిటరూ ఎవ్వరి దగ్గరా ఒక్క మాట కూడా అనిపించుకోవటానికి ఇష్టపడడు. ఏమైనా అంటే వాడు మనల్ని పురుగును చూసినట్లు చూస్తాడనీ తెలుసు.

అయినా అవతలి వాడి మొహంలోని, మనసులోని భావాలతో పని లేకుండా నా కోపాన్ని ప్రదర్శించగలిగే ఏకైక ప్రదేశం హోటలే. స్వేచ్ఛ, ఏకాంతం పొందగలిగేది హోటల్లోనే. మళ్లీ నగరానికి ఎప్పుడొస్తానో, హోటల్లోకి ఎప్పుడు వెడతానో అనిపించింది. నేను వెళ్లే ప్రాంతంలో హోటల్ తిండి కుదరదు. క్వార్టర్స్‌లో వండుకుని తినాల్సిందే. రుచి మరిగిన వాణ్ని, స్వయంపాకంతో తృప్తిపడాల్సి వస్తోంది. ప్రేమగా తనివితీరా హోటల్‌ను మరోసారి చూసుకుని, వెనుతిరిగాను.

నిత్యం రద్దీగా ఉండే రోడ్డును ఎవరైనా దాటుతారేమో చూద్దామనిపించి చాలాసేపట్నుంచి అక్కడే నిలబడ్డాను. రోడ్డుకు అవతలి వైపు గడ్డం మనిషి కనిపించాడు.

శీను ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. వాడికి అదొక జబ్బు. అక్కడక్కడా అసంకల్పితంగా వింటూ రోడ్డు వైపే చూస్తూ ఉన్నాను.

గతంలో నగరానికి వచ్చిన కొత్తలో ఓసారి ఉత్సాహంగా, ధైర్యంగా రోడ్డు దాటే సాహసం చేసి ఆసుపత్రి పాలయ్యాను.

అప్పట్నుంచి ఎవరైనా రోడ్డు దాటుతుంటే చూడాలనే కోరిక అట్లాగే మిగిలిపోయింది.

రోడ్లు, మనుషులు ఖాళీగా ఉంటే చూడాలని కూడా చాలా కాలం ప్రయత్నించాను. కుదరనే లేదిప్పటికి.

కనీసం నగరాన్ని విడిచి వెళ్లే ముందైనా రోడ్డు దాటిన వాణ్ణి చూద్దామనుకున్నాను.

ఆ గడ్డం మనిషి మరుక్షణం రోడ్డు దాటే వాడిలాగా ఒక కాలు ముందుకేసి, సిద్ధంగా నిలబడ్డాడు. కాలం కదులుతూ ఉంది. అతడు కదిలే ప్రయత్నం చేయలేదు. నాలో ఉత్సాహం, ఉద్వేగం పెరిగిపోయాయి. ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తున్నాను.

నా ఆలోచనలతో, నిరీక్షణతో, కాలం, వేగం, దూరాలతో వేటితోనూ సంబంధం లేని వాడిలా, అతడు రోడ్డు దాటే ప్రయత్నాన్ని విరమించుకుని రోడ్డుకు సమాంతరంగా కదిలి జనంతో కలిసిపోయాడు.

''నడుద్దామా'' అన్నాడు శీను ముందుగా కదులుతూ.

రద్దీ రోడ్లపై నడవటానికి భయమేసింది. జేబు తడుముకుంటూ ''ఆటో'' అన్నాను హుషారుగా! శీనువైపు చూడకుండా.